శోభకృత్‌లో అన్నీ శుభాలే

నరసరావుపేట రూరల్: శోభకృత్ నామ సంవత్సరంలో అన్ని శుభాలే జరుగుతాయని ఆగమ ప్రవర డాక్టర్ వేదాన్తం సత్యశ్రీనివాస అయ్యంగార్ తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారి దేవస్థానంలో పంచాంగ శ్రవణ ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం పంచాంగ శ్రవణ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ వేదాన్తం సత్య శ్రీనివాస అయ్యంగార్ పంచాంగ శ్రవణం నిర్వహించారు. శోభకృత్ తెలుగు నూతన సంవత్సరంలో అందరూ సంతోషంగా ఉంటారని తెలిపారు. వర్షాలు సకాలంలో కురుస్తాయని, పంటలు సమృద్ధిగా పండుతాయని వివరించారు. నూతన సంవత్సరంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి ఆటుపోటులు ఎదురైనా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటారని తెలిపారు.

ఆదాయం తక్కువగా, ఖర్చులు ఎక్కువగా ఉంటాయని, ఖర్చులే ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికి ఆదరణ తీసుకువస్తామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జల్లి శ్రీనివాసరావు, మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఏల్చూరి అశోక్‌బాబు, వంకా శ్రీనివాసరెడ్డి, నిడమానూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో..

బొల్లాపల్లి: సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా మండల ప్రజలు ఉగాది వేడుకలు నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరించారు. ఆలయాల్లో శోభాకృత్ నామ సంవత్సరం పంచాంగ శ్రవణం గావించారు.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: మండలంలో ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయాలు, రచ్చబండల వద్ద పంచాంగ శ్రవణాలు జరిపారు. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. రొంపిచర్లలోని శంకర స్వామి తిరునాళ్ల కూడా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా భజనా కార్యక్రమాలు, విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది పండుగ

చిలకలూరిపేట: తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను బుధవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇళ్ల గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి, నూతన వస్త్రాలు ధరించి తమ ఇష్టదైవాలను కొలిచేందుకు ఆలయాల్లో బారులు తీరారు. వేదమంత్రోచ్చారణ, పంచాంగ శ్రవణాలతో దేవాలయాల్లో సందడి నెలకొంది. ఆలయాల్లో శోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సంప్రదాయరీతిలో ఉగాది వేడుకలు

నరసరావుపేట ఈస్ట్: శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగను బుధవారం పట్టణంలో సంప్రదాయరీతిలో నిర్వహించారు. ఆలయాల్లో భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలతో పాటు ఉగాది పచ్చడిని ప్రసాదంగా అందజేశారు. పండితులు ఉగాది పంచాంగం శ్రవణం నిర్వహించారు. శ్రీవాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పాండురంగస్వామి ఆలయం వద్ద ఉగాది పచ్చడి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. సత్తెనపల్లిరోడ్డులోని ఆవుల సత్రంలో గోమాత పూజలు జరిపారు. షిరిడీ సాయినాథుని మందిరంలో ఆలయ కమిటీ ప్రతినిధి భాగవతుల లక్ష్మీనారాయణబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో తమిళనాడు శ్రీరంగం ఆలయ విద్వాంసులు సుభాని, కాలేషాబీ నాదస్వర కచ్చేరి భక్తులను రంజింపజేసింది. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ఉగాది వేడుకలు నిర్వహించి ప్రసాదం అందజేశారు.

ఆలయాలు కిటకిట

యడ్లపాడు: శోభాకృత్ నామ ఉగాది సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం ఉదయం నుంచి యడ్లపాడు, బోయపాలెం, సొలస, కొత్తపాలెం, కొండవీడు, లింగారావుపాలెం, మైదవోలు, తిమ్మాపురం, ఉన్నవ, జాలాది, జగ్గాపురం గ్రామాల్లో శైవ, వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతామూర్తులకు విశేష అలంకరణలు చేశారు. సాయంత్రం పలుచోట్ల పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెన్నముద్దల బాలకృష్ణుని ఆలయంలో..

చెంఘీజ్‌ఖాన్‌పేటలోని పురాతన వెన్నముద్దల బాలకృష్ణుని ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు పర్చూరి సత్యనారాయణ చార్యులు, రాఘవేంద్ర, జితేంద్ర ఆధ్వర్యంలో జరిగాయి. పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా అడవిపేరంటాళ్లమ్మ తిరునాళ్ల

శావల్యాపురం: ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం శానంపూడి శివారు గ్రామమైన బొందిలిపాలెంలో వేంచేసిఉన్న అడవిపేరంటాళ్లమ్మ తిరునాళ్లను వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు పొంగించి, అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారులు మొక్కుబడి ప్రభలతో వివిధ గ్రామాలు నుంచి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, ఆయన సతీమణి ఆదిలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ చైర్మన్ సోమేపల్లి వీరాంజనేయులు, గ్రామ సర్పంచ్ బోడాల వీరాంజనేయులు దేవదాయ శాఖ అధికారి పి.వెంకటరెడ్డి, అమ్మిరెడి శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు. దేవాలయాన్ని విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. తిరునాళ్లకు ఇరురాష్ట్రాల నుంచి భక్తులు సుమారు 80 వేల మంది అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించినట్లు దేవదాయ అధికారులు వెల్లడించారు. వినుకొండ రూరల్ సీఐ ఎస్.రమేష్‌బాబు పర్యవేక్షణలో ఎస్ఐ గల్లా రవికృష్ణ 200 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శావల్యాపురం వాసి దాట్ల వెంకటేశ్వరరాజు తిరునాళ్ల భక్తులకు అన్నసంతర్పణ చేశారు. వినుకొండ నియోజకవర్గం యాదవ సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించినట్లు సంఘం ప్రతినిధి ఆర్.శివయ్య తెలిపారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు సయ్యద్ ఇబ్రహీం, భాస్కర్ ఆరోగ్య సిబ్బంది మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శివశక్తిలీలాఅంజన్ ఫౌండేషన్ వారు భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కో-ఆర్డినేటర్ భీమని అంకారావు, చింతా అంకమ్మరావు, అల్లూరి వెంకట్రావు, సర్పంచ్‌లు మొనపాటి శ్రీనివాసరావు, చింతా పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి ఉగాది పురస్కారాలు అందజేత

నరసరావుపేట రూరల్: దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో దేవాలయాల్లో ఇద్దరు అర్చక స్వాములు, ఒక వేద పండితుడికి కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి ఉగాది పురస్కారాలతో బుధవారం సత్కరించారు. దేవస్థానంలో అర్చక స్వాములుగా పనిచేస్తున్న కొండకావూరి వేంకటసుబ్రహ్మణ్య ప్రసాద్‌శర్మ, కొండకావూరి దుర్గాప్రసాద్ శర్మ, వేద పండితులు శ్రీరాముల రాజశేఖర్‌శర్మకు ఒక్కొక్కరికీ రూ.10,116, వస్త్రాలు, పండ్లు, ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. ముందుగా సిద్ధి గణపతి పూజ, పంచాంగ శ్రవణం నిర్వహించి, వేదోక్తంగా ఆశీర్వచనం నిర్వహించారు. దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు కొండకావూరి అప్పయ్య గురుకుల్ పంచాంగ శ్రవణం చేశారు. దేవస్థానంలో పనిచేస్తున్న అందరూ అర్చక స్వాములకు, చండి సప్తశతి పారాయణదారుని అందరినీ కార్యనిర్వహణాధికారి వేమూరిగోపి శాలువాలు, పుష్పమాలలతో సత్కరించారు. మాజీ ధర్మకర్త ముక్కు వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సోషల్ మీడియా కన్వీనర్ మట్ల లింగారెడ్డి, దేవస్థానం సూపరింటిండెంట్ నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది పురస్కారం అందుకున్న కవి కరిముల్లా

వినుకొండ టౌన్: పట్టణానికి చెందిన కవి కరిముల్లా ఉగాది పురస్కారం పొందడంతో పలువురు ప్రముఖులు, కవులు, చిత్రకారులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉగాది పురస్కారాల కార్యక్రమాన్ని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధ్యక్షతన బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట శాసనసభ్యుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ పురస్కారాలు ప్రదానం చేశారు.



పంచాంగ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి


అమ్మవారి సేవలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దంపతులు


సత్కారగ్రహీతలతో ఈవో గోపి తదితరులు

క్లుప్తంగా

నిండు కుండల్లా తాగునీటి చెరువులు



నాదెండ్ల: వేసవి తాగునీటి ఎద్దడి నివారణకు మండలంలోని అన్ని గ్రామాల చెరువులను సాగర్ జలాలతో నింపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ తెలిపారు. మండలంలోని అన్ని చెరువులు పూర్తిగా నిండినట్లు తెలిపారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పంచాయతీ అధికారులతో కలిసి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మేజర్ పంచాయతీ గణపవరంలోని 40 ఎకరాల రక్షిత మంచి నీటి చెరువును గత వారం రోజులుగా సాగర్ జలాలతో నింపటంలో సఫలీకృతులవడంతో పూర్తి స్థాయిలో చెరువు నిండింది. మరో ఆరేడు నెలలపాటూ తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని పంచాయతీ కార్యదర్శి అర్వపల్లి శేఖర్ తెలిపారు.

తల్లి మందలించిందని కుమారుడు ఆత్మహత్య

యడ్లపాడు: తల్లి మందలించిందని ఆత్మహత్యకు పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైదవోలు గ్రామానికి చెందిన పచ్చల వేళంగిణి రాజు దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో చిన్నవాడైన పచ్చల మాధవ మంగళవారం ఉదయం మద్యం సేవించి ఇంటికి రావడంతో గమనించి, ఇవేం పనులంటూ తల్లి మందలించింది. మత్తులో ఉన్న మాధవ (18) ఆవేశంతో ఇంటికి మద్యం తెచ్చుకుని అందులో పురుగుల మందు కలుపుకుని తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి గుంటూరు సమగ్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతిని తండ్రి ఫిర్యాదు మేరకు యడ్లపాడు ఎస్ఐ పైడి రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైర్లు తగిలి గొర్రెల కాపరి మృతి

నాదెండ్ల: మొక్కజొన్న పొలానికి వేసిన సోలార్ కరెంటు ఫెన్సింగ్ వైర్లు తగిలి గొర్రెల కాపరి దుర్మరణం పాలైన సంఘటన బుధవారం అప్పాపురం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నాదెండ్ల గ్రామానికి చెందిన గోరంట్ల వెంకటరావు (40) గొర్రెలను మేపుకుని జీవనం సాగిస్తుంటాడు. బుధవారం తన గొర్రెలను తీసుకుని అప్పాపురం పొలాల వైపు వెళ్లాడు. అప్పాపురం గ్రామానికి చెందిన పఠకమూరి శ్రీను అనే రైతు తన మొక్కజొన్న పొలానికి పశువుల నుంచి రక్షణ కోసం సోలార్ కరెంటు ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నాడు. గొర్రెలను మేపుకునేందుకు అటుగా వెళ్లిన వెంకటరావుకు ప్రమాదవశాత్తు వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు గమనించి అతన్ని చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వెంకటరావు మృతితో నాదెండ్ల బీసీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

31లోగా ప్రైవేట్ హాస్పిటళ్లు సర్టిఫికెట్లు పొందాలి

నరసరావుపేట: జిల్లాలో హాస్పిటల్స్‌తో పాటు ప్రైవేట్‌గా వైద్యసేవలు అందజేసే యూనిట్ల నిర్వాహకులు ఈ నెల 31లోగా రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ చేసుకొని సర్టిఫికెట్లు పొందాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఏపీఎంసీఈ చట్టం-2008, క్లినికల్ ఎస్టాబిష్‌మెంట్ యాక్ట్ జీవో నంబరు 135ను అనుసరించి జిల్లాలోగల హాస్పిటళ్లు, ఫిజియోథెరపీ, డెంటల్ క్లినిక్స్, ల్యాబ్‌లు నూతనంగా పెట్టినవి అయితే వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఐదేళ్లు దాటిన పాతవి అయితే ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకొని రెన్యువల్ చేయించుకొని సర్టిఫికెట్లు పొందాలని పేర్కొన్నారు. రాష్ట్ర విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసిన సమయంలో సర్టిఫికెట్లు లేకుండా పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కాకతీయ అన్నదాన సత్రానికి విరాళాలు

శావల్యాపురం: బొందిలిపాలెం గ్రామంలో వేంచేసిఉన్న అడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల సందర్భంగా కాకతీయ అన్నదాన సత్రానికి దాతలు విరాళాలు అందజేస్తున్నట్లు వ్యవస్థాపక కమిటీ సభ్యుడు నాగుబడి వీరనారాయణ బుధవారం తెలిపారు. గుంటుపాలెం గ్రామానికి చెందిన జైశ్రీరాం యూత్ రూ.30,116, మతుకుమల్లి గ్రామవాసి ఆలూరి వెంకట నరసయ్య, నాగేశ్వరమ్మ దంపతులు రూ.15 వేలు, మురళీకృష్ణ రూ.15 వేలు, రవిప్రసాద్ రూ.15 వేలు, భీమని శ్రీనివాసరావు రూ.15,116, చింతా రమణయ్య రూ.10,116, వేముల లక్ష్మీనారాయణ రూ.10,116, పోట్లూరు గ్రామానికి చెందిన యలవర్తి చినవెంకటేశ్వర్లు రూ.15 వేలు, వెల్లలచెరువు వాసి చింతా శ్రీధర్‌బాబు రూ.10,116, కారుమంచి గ్రామవాసి చుండూరి రామకోటేశ్వరరావు రూ.10,116, కొత్తలూరు గ్రామవాసి గోపు వెంకటేశ్వర్లు రూ.10,116 అన్నదానం నిమిత్తం విరాళాలు అందజేశారన్నారు. కాకతీయ అన్నదాన సత్రం అభ్యున్నతికి దాతల సహకారం అభినందనీయమన్నారు.

ఏఎంజీ డైరెక్టర్ అరుణ్‌కుమార్ మహంతికి ఉగాది పురస్కారం


మంత్రి అంబటి నుంచి పురస్కారం అందుకుంటున్న అరుణ్‌కుమార్ మహంతి

చిలకలూరిపేట: ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ మహంతి ఉగాది పురస్కారం అందుకున్నారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఏఎంజీ సంస్థ ద్వారా అందించిన సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు, ఏఎంజీలో చేరకముందు బ్యాంకింగ్ రంగంలో అందించిన సేవలను దృష్టిలో ఉంచుకొని ఆయనకు ఈ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు అభినందనలు తెలిపారు.

తెలుగు లోగిళ్లలో ఉగాది సందడి

నాదెండ్ల: తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఇంటి లోగిళ్లలో మామిడి తోరణాలు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీపూజ అనంతరం షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని ఆరగించారు. నూతన వస్త్రాలతో ప్రతి ఇల్లు కళకళలాడింది. ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం పంచాంగ శ్రవణం చేశారు. గణపవరంలోని గంగాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ప్రధాన పూజారి చందలూరి పేరయ్యశాస్త్రి పంచాంగాన్ని చదివి వినిపించారు. ఇదే గ్రామంలోని రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయం, వీరాంజనేయస్వామి ఆలయాల్లో అర్చకులు అనుమంచి సూర్యప్రకాశరావు, శ్రీవత్స పంచాంగాన్ని వినిపించారు. యడ్లపాడు, నాదెండ్ల మండల రణవీరాంజనేయస్వామి, బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో 250 మందికి పంచాంగ పుస్తకాలు అందించారు.

పదో తరగతిలో సత్తా చాటాలి


ఫేర్‌వెల్‌లో పాల్గొన్న పదో తరగతి విద్యార్థులతో హెచ్‌ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు

నాదెండ్ల: పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని హెచ్‌ఎం తాడిశెట్టి సత్యనారాయణ చెప్పారు. గణపవరం కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పల్నాడు జిల్లాలోనే 1300 మంది పైబడి విద్యార్థులతో అతిపెద్ద పాఠశాలగా తమ హైస్కూల్ ఉందన్నారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 168 మంది ఉన్నారన్నారు. గత ఏడాది కరోనా కారణంగా ఫలితాల్లో కొంత శాతం తగ్గుదల కనిపించిందని, ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. గడిచిన మూడేళ్లలో 20 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారన్నారు. పోటీతత్వం, ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



వినుకొండ టౌన్: పౌష్టికాహారంతో పాటు ఏఆర్టీ మందులను సక్రమంగా తీసుకోవడం ద్వారా జీవిత కాలాన్ని పొడిగించుకోవచ్చని ప్రభుత్వ వైద్యశాల వైద్యులు ఎస్.బుచ్చిబాబు పేర్కొన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్‌కేర్ సెంటర్‌లో చైల్డ్ ఫండ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ లింక్ వర్కర్ స్కీమ్ ప్రాజెక్ట్ వారి ఆధ్వర్యంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు డాక్టర్ ముసలారెడ్డి సహకారంతో పౌష్టికాహారాన్ని బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్ ఎం.వాసుదేవరావు మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపరాదని సూచించారు. ఐసీటీసీ కౌన్సిలర్ కె.సురేష్, జోనల్ సూపర్‌వైజర్స్ బి.నాగేశ్వరరావు, ఎం.విశ్వేశ్వరరావు, లింకు వర్కర్ వై.ఏడుకొండలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పెదకూరపాడు: బాలిక అదృశ్యంపై బుధవారం పెదకూరపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ టీవీ కృష్ణారావు కథనం ప్రకారం.. బెల్లంకొండ మండలం రామాంజినేయపురం గ్రామానికి చెందిన ఉల్లిగడ్డల జయమ్మ, చిన్నకొటయ్యల 17 ఏళ్ల కుమార్తె గత ఏడాది పదో తరగతి బెల్లంకొండలో చదివి ఉత్తీర్ణత సాధించలేదు. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం పెదకూరపాడు మండలం 75త్యాళ్ళూరు గ్రామానికి చెందిన పెద్దమ్మ మేడా లక్ష్మి ఇంటికి వచ్చింది. ఈ నెల 19న రాత్రి నుంచి ఆమె కనపడడం లేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో శావల్యాపురం విద్యార్థినుల సత్తా


విజేతలను అభినందిస్తున్న ఎంపీపీ, చైర్మన్

శావల్యాపురం: రాష్ట్ర స్థాయిలో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో శావల్యాపురం హైస్కూల్ విద్యార్థినులు సత్తా చూపడం అభినందనీయమని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ అన్నారు. హైస్కూల్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో ఎంపీపీ మాట్లాడుతూ బాలబాలికలు విద్యతో పాటు క్రీడాల్లో రాణించటం శుభపరిణామమన్నారు. పాఠశాల హెచ్‌ఎం జాలాది శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 20 వరకు నెల్లూరు జిల్లా కావలిలో 7వ జూనియర్ (అండర్-19) బాలికల బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచిందని చెప్పారు. ఇదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి ముక్కపాటి లిఖిత ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 3 వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటుందని పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి తెలిపారు. క్రీడాకారులను అభినందించి తమవంతు ఆర్థిక చేయూత అందించిన ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, శావల్యాపురం సొసైటీ చైర్మన్ చెన్నయ్యను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, ఉపాధ్యాయులు బీవీ నాగేశ్వరరావు, భువనేశ్వరి, కిషోర్, అబ్దుల్లా, ఆదాంఖాన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఇస్కాన్ వార్షికోత్సవం


ప్రత్యేక అలంకరణలో రాధాగోవిందులు

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని రాధాగోవింద చంద్ర మందిరం ఇస్కాన్ ఆలయంలో ఉగాది వేడుకలు, ఆలయ 11వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం మూలమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, శుభ మంగళ హారతి సమర్పించి ప్రత్యేక అలంకరణలతో భక్తులను దర్శనానికి అనుమతించారు. మూలమూర్తుల ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉత్సవమూర్తులకు 54 రకాల ఫలద్రవ్యాలు, పంచామృతాలతో మహాశంఖాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 1008 కిలోల పూలతో మహాపుష్పాభిషేకం నిర్వహించి ఉత్సవమూర్తులకు ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవం జరిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా రెడ్డిపేరంటాలమ్మ వార్షికోత్సవం


ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

నాదెండ్ల: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు సాతులూరు గ్రామంలో కొలువైన రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. వేకువజాము నుంచే భక్తులు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. మొక్కుబడుల ప్రభలు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. దాతలు ప్రసాదాలు పంపిణీ చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా కావమ్మ తల్లి తిరునాళ్ల


అలంకరణలో కావమ్మతల్లి, మారయ్య స్వామి

చిలకలూరిపేట: పట్టణంలోని శారద జెడ్పీ హైస్కూల్ రోడ్డులో ఉన్న కావమ్మ తల్లి, మారయ్య గుడి తిరునాళ్ల మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణలు గావించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మహిళా భక్తులతో కుంకుమ పూజ, నూతన వస్త్రాల బహూకరణ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాపా వీరరాఘవులు ఆధ్వర్యంలో కర్రసాము, కత్తిసాము ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మేళ్లవాగులో రత్తమ్మతల్లి తిరునాళ్ల

బొల్లాపల్లి: మేళ్లవాగు గ్రామంలో రత్తమ్మ తల్లి తిరునాళ్లను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు దేవతకు పూజలు చేసి పొంగళ్లతో నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

మిరప రైతులను ఆదుకోవాలి

యడ్లపాడు: వడగండ్ల వానతో దెబ్బతిన్న మిరప పొలాలను రైతు, కౌలురైతు సంఘం నాయకులు బుధవారం పరిశీలించారు. కారుచోల గ్రామానికి చెందిన రైతులు గొట్టం నాగేశ్వరరావు, పెద్ది వీరయ్య విజయ్‌కాంత్, కల్లూరి భూషయ్య పొలాల్లో ఇటీవల కురిసిన వడగండ్ల వానతో పంట నేలమట్టమైందని, సదరు పొలాలను అధికారులు వెంటనే సర్వేచేసి నష్టం వివరాలు ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. రాష్ట్ర కౌలు రైతు సంఘం కార్యదర్శి వై.రాధాకృష్ణ, సంఘం నాయకులు కల్లూరి రామస్వామి, రామారావు, నూతలపాటి కాళిదాసు, శంకరరావు పాల్గొన్నారు.

జిల్లా వక్ఫ్‌బోర్డు మెంబర్‌కు సన్మానం



వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు మెంబర్‌గా నియమితులైన పట్టణానికి చెందిన హాఫిజ్ అద్దంకి గౌస్‌బాషాను స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వినుకొండ శాసన సభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు అభినందించి సన్మానించారు. నిబద్ధతతో పనిచేసి రానున్న రోజుల్లో మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీనస్ ఆక్వా నూతన షాపు ప్రారంభం


షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రొయ్యలు, చేపల మేత పంపిణీ వీనస్ ఆక్వా నూతన షాపును ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ఆక్వా వంటి పెద్ద కంపెనీలు వినుకొండ ప్రాంతాల్లో రైతుల కోసం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. అనంతరం షాపు యాజమాన్యం ఎంపీడీ మల్లేశ్వరరావు, ఏవీ సుబ్రహ్మణ్యం, పణిదపు వెంకటేశ్వర్లు, దీపక్ నెక్సజన్ కంపెనీ డైరెక్టర్లు అప్పారావు, సత్యనారాయణ, రాజశేఖర్, వీరంద్రప్రభును ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే బొల్లా తనయుడు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ నూజెండ్ల మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com